క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధి అనాజ్‌పూర్, గుంతపల్లి, మజీద్‌పూర్ గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని, అనంతరం పసుమాముల గ్రామంలో ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆమనగల్లులో.. కసిరెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పర్యటించనున్నారని మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో క్రిస్టియన్ మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

విగ్రహప్రతిష్ఠాపనోత్సవం



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

కడ్తాల్: మండల పరిధి ఎక్వాయిపల్లి గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆదివారం ఆలయంలో గణపతి పూజ, ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విగ్రహదాత కొండల్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వీరయ్య, నాయకులు సాయిలు, కరుణాకర్‌గౌడ్, యాదయ్యగౌడ్, యాదయ్య, సుమన్, శంకర్, మధు, శంకర్, శివ, రాఘవేంద్ర, శ్రీను, కిష్టయ్య, ముత్యాలు, సత్తయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న సాధన సమితి నాయకులు

యాచారం: ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని మన ఆలోచన సాధన సమితి నాయకులు అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఆదివారం మండల పరిధి చౌదర్‌పల్లి గ్రామంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొంపోజ్ నరహరి మాట్లాడుతూ.. ఐక్యంగా పోరాడి రిజర్వేషన్లు సాధించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ నాయకులు నర్సింహచారి, నర్సింహ, జంగాచారి, నాగార్జున, శ్రీనువాస్‌చారి, శ్రీశైలం, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



ఎస్‌ఐకి నగదు అందజేస్తున్న దాతలు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానికులు వజ్రం రూ.10 వేలు, మాణిక్‌రెడ్డి రూ.10 వేలను ఆదివారం ఎస్‌ఐ శ్రీకాంత్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రేణురెడ్డి, అంజయ్య, పవన్, వాల్మీకి, నరేందర్ గౌడ్, శివ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న మిత్రులు

ఆమనగల్లు: స్నేహితుడి కుటుంబానికి బాల్య మిత్రులు అండగా నిలిచారు. జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మీసాల మహేశ్ ఇటీవల మృతి చెందాడు. తలకొండపల్లి మండలం రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007- 2008లో మృతుడితో కలిసి పదో తరగతి చదువుకున్న మిత్రులు.. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం బాధిత కుటుంబానికి రూ.29,500లు ఆర్థిక సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో మహేశ్, మల్లేశ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులున్నా.. బస్సులు రాక!



బస్సులు రాక బోసిపోయిన ఇబ్రహీంపట్నం పాత బస్టాండ్

కొత్తవింత. పాతరోత అంటారు. అభివృద్ధి నేపథ్యంలో ఇబ్రహీంపట్నంలో జాతీయ రహదారిపై కొత్తగా ఆర్టీసీ బస్టాండును నిర్మించారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ.. దశాబ్దాల పాటు సేవలు అందించిన పాత ప్రయాణ ప్రాంగణాన్ని విస్మరించడంతో ప్రస్తుతం అది వెలవెలబోతోంది. పాతబస్తీ నుంచి ప్రయాణికుల రాకపోకలు ఉన్నప్పటికీ.. సర్వీసులు అంబేడ్కర్ కూడలికే పరిమితం అయ్యాయి.

- కళతప్పిన పాత బస్టాండ్
- సక్రమంగా రాని సబర్బన్, మెట్రో సర్వీసులు
- అంబేడ్కర్ కూడలికే పరిమితం
- అక్కడే ప్యాసింజర్ల దించివేత
- 2.5 కి.మీ. దూరం తప్పని నడక

ఇబ్రహీంపట్నం: నిత్యం ప్రయాణికుల రద్దీ, బస్సుల రాకపోకలతో కళకళలాడిన పాత బస్టాండు బోసిపోతోంది. హైదరాబాద్- ఇబ్రహీంపట్నం పట్టణానికి రాకపోకలు సాగించే సర్వీసులు బస్టాండులోకి సక్రమంగా రాకపోవడంతో కళతప్పింది. దీంతో స్థానికులకు రవాణా కష్టాలు అధికమయ్యాయి. ఉపాధి నిమిత్తం నగరానికి ఇబ్రహీంపట్నం నుంచి వెళ్లి వస్తుంటారు. పట్టణంలోని వివిధ బస్తీల నుంచి వచ్చే వారికి పాత బస్టాండ్ కిలో మీటర్ దూరంలో ఉంటుంది. అదే కొత్త బస్టాండ్‌కు వెళ్లాలంటే 2.5 కి.మీ దూరం అవుతుంది. అక్కడికి వెళ్లడానికి స్థానికంగా ఆటోల సదుపాయం లేదు. వెళ్తే కాలి నడకనే వెళ్లాల్సి ఉంటుంది.

అంబేడ్కర్ కూడలిలో దింపివేత

గతంలో జిల్లా, గ్రామీణ, పట్టణ ప్రాంతానికి వెళ్లే బస్సులు.. పాత బస్టాండ్ వరకు వచ్చేవి. కొత్తగా నాగార్జునసాగర్- హైదరాబాద్ ప్రధాన రహదారిపై బస్టాండును నిర్మించడంతో జిల్లా, రూరల్ ప్రాంతాల సర్వీసులు ఇక్కడికి రావడం లేదు. కేవలం రాజధానికి వెళ్లే సబర్బన్ మెట్రో సర్వీసులే అడపాదడపా వస్తున్నాయి. నగరానికి వెళ్లి వచ్చే బస్సులు పాత బస్టాండు వరకు రావాల్సి ఉంది. కానీ.. కొందరు డ్రైవర్లు అంబేడ్కర్ కూడలి వరకే వస్తూ.. ప్రయాణికులను దింపివేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన వారికి సిబ్బంది నుంచి దురుసు సమాధానే వస్తోందని పలువురు పేర్కొన్నారు.

కేఎంపీఎల్ పై ప్రభావం పడుతుందని..

మధ్యలో దింపివేతపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రగతి రథం.. ప్రజల నేస్తం అంటే ప్రజల అవసరాలను గుర్తించాలని, ఇలా ఎక్కడపడితే అక్కడే దింపివేస్తే గమ్యస్థానాలకు తాము ఎలా వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా.. పాత బస్టాండ్ వరకు వస్తే కేఎంపీఎల్ పై ప్రభావం పడుతుందని, అందుకే లోనికి వచ్చేందుకు డ్రైవర్లు విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇది ప్రయాణికులకు ఇక్కట్లు తెచ్చిపెడుతోంది. డబ్బులు చెల్లించి ఇంటికి వెళ్దామన్నా.. లోకల్‌లో ఆటోల సౌకర్యం లేదు. చేసేది లేక కాలినడక వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. రాత్రి వేళల్లో కష్టాలు చెప్పలేనివని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్థ అధికారులు స్పందించి, నగరానికి వచ్చివెళ్లే బస్సులన్నీ పాత బస్టాండ్ వరకు రాకపోకలు సాగించేలా చూడాలని కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు



రోడ్డు రవాణ సంస్థ ప్రయాణికుల సమస్యలను పట్టించుకోవడం లేదు. ఆదాయం గురించే ఆలోచిస్తోంది. స్థానికంగా ఆర్టీసీ డిపో ఉన్నా తిప్పలు తప్పడం లేదు. ప్యాసింజర్స్‌ను గమ్యస్థానాలకు చేర్చాల్సిన డ్రైవర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మధ్యలో దింపేసి చేతులు దులుపుకొంటున్నారు. ఫిర్యాదు చేస్తే సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు.

– బండి మహేశ్, ఇబ్రహీంపట్నం

కండక్టర్లకు ఇష్టముంటేనే..



పాత బస్టాండ్ వరకు బస్సులను తిప్పాలని స్థానికులు, ప్రయాణికులు కోరినా.. డ్రైవర్లు కనికరం చూపడం లేదు. కండక్టర్లకు ఇష్టముంటేనే ఊర్లోకి(పాత బస్టాండ్‌కు) బస్సులొస్తాయి. ఈ పరిస్థితి మారాలి. లేకపోతే వృద్ధులు, మహిళలు, పిల్లలు పాత బస్తీకి 2.5 కి.మీ. దూరంలో ఉన్న కొత్త బస్టాండు నుంచి ఊర్లోకి రాకపోకలు ఎలా కొనసాగిస్తారు? అధికారులు స్పందించి సర్వీసులు లోపలికి వచ్చేలా చూడాలి.

– నాగిళ్ల అశోక్, పాతబస్తీ, ఇబ్రహీంపట్నం

పాత బస్టాండ్‌కు వెళ్లాల్సిందే



హైదరాబాద్- ఇబ్రహీంపట్నంకు నడిచే సబర్బన్, మెట్రో సర్వీసులన్నీ పాత బస్టాండ్‌కు తప్పనిసరిగా వెళ్లి రావాల్సిందే. ట్రాఫిక్ సమస్య ఉన్నప్పుడు సమస్య తలెత్తుతుంది. పాత బస్తీకి బస్సులు రాకుంటే తమ దృష్టికి తేవాలి. అవసరమైతే ఓ కంట్రోలర్‌ను నియమించి, పాత బస్టాండ్‌కు బస్సులు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటాను. సమస్యను పరిష్కరిస్తాము.

– వెంకట నర్సప్ప, డిపో మేనేజర్, ఇబ్రహీంపట్నం

ప్రజాసేవే 'రాధాకృష్ణ' లక్ష్యం



యువతి వివాహానికి నగదు, చీరను బహూకరిస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: ప్రజాసేవే రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని, ఎవరికి ఏ ఆపద వచ్చినా అండగా ఉంటామని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల పరిధి టాక్‌రాజ్‌గూడతండా, కానుగుబావితండాల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. కానుగుబావితండాలో దేవీ- కిషన్ దంపతుల కూతురు మీన వివాహానికి రూ.21 వేల నగదు, పట్టుచీరను బహూకరించారు. మాజీ ఉప సర్పంచ్ శారద రూ.25 వేలు, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.5 వేలు, సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యా రూ.5 వేలు, శ్రీను రూ.10 వేలు, లక్ష్మణ్ రూ.10 వేలు, శ్రీను రూ.5 వేలు సహాయంగా అందజేశారు. టాక్‌రాజ్‌గూడతండాలో అనిత- దేవుల దంపతుల కుమార్తె నిహారిక వివాహానికి రూ.21 వేలు, పట్టుచీరను అందజేశారు. కోట్యానాయక్ రూ.10 వేలు ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు హరిచంద్‌నాయక్, సాయిలు, మాజీ ఎంపీటీసీలు చంద్రమౌళి, రమేశ్, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, జగన్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ధర్మానాయక్, రాములునాయక్, కృష్ణయ్య, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, పాండు తదితరులు పాల్గొన్నారు.

10న సర్దార్ పాపన్నగౌడ్ జయంతి

గౌడ సంఘం మండల అధ్యక్షుడు సుధీర్‌గౌడ్



వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మహేశ్వరం: ఈ నెల 10న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహారాజ్ 375వ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని గౌడ సంఘం మండల అధ్యక్షుడు నిమ్మగూడెం సుధీర్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని గౌడ సంఘం కార్యాలయంలో పాపన్నగౌడ్ జయంతి వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మొట్టమొదటి బహుజన వీరుడన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వారోత్సవాలు హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకులు వట్టికూటి రామారావుగౌడ్, పి. సురేష్‌గౌడ్, కొండా రాజేశ్‌గౌడ్, మచ్చేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, బాపిరాజుగౌడ్, వరుణ్‌గౌడ్ పలువురు పాల్గొన్నారు.

వార్షికోత్సవాలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, ఆలయ చైర్మన్ రత్నం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

తుక్కుగూడ: మండల పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయ 42వ వార్షికోత్సవం సందర్భంగా (బోనాలు, కల్యాణం) ఈ నెల 11 నుంచి 13 వరకు మూడురోజుల పాటు వేడుకలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వార్షికోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి చేతుల మీదుగా నగరంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్, బీఆర్‌ఎస్ శ్రేణులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

తుక్కుగూడ: రాష్ట్రంలో ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ నెల 6న ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ తెలిపారు. ఆదివారం పుర కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్‌పై బీజేపీ కపట నాటకం ఆడుతోందన్నారు. ఈ ధర్నాకు నియోజకవర్గం నుంచి బీసీలు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఢిల్లీకి వచ్చే బీసీ నాయకులు ఈ నెల 4వ తేదీన ఉదయం 9 గంటలకు చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక రైలు అందుబాటులో ఉందన్నారు. 4న బీసీ రిజర్వేషన్ అమలు, 5న పార్లమెంట్ వాయిదా తీర్మానం, 6న మహాధర్నా, 7న రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం ఇస్తామని తెలిపారు.

నియామకం

హయత్‌నగర్: సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా హయత్‌నగర్‌కు చెందిన రమావత్ సక్రూనాయక్ నియమితులయ్యారు. ఇటీవల మొయినాబాద్‌లో జరిగిన పార్టీ 17వ మహాసభలో నాయకులు పాలమాకుల జంగయ్య ఆధ్వర్యంలో ఎంపిక చేసినట్లు రమావత్ ఆదివారం తెలిపారు.

వీరభద్ర కల్యాణ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రిక ఆవిష్కరణలో వీరశైవ లింగాయత్‌లు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం చెరువు కట్ట కింద స్వయంభువుగా వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కల్యాణం ఆహ్వాన పత్రికను వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శెట్టి శివకుమార్ మాట్లాడుతూ.. శ్రావణ మాసం బహుళ నవమి (17వ తేదీన) ఉదయం 11.45 గంటలకు కల్యాణం నిర్వహించనున్నామని తెలిపారు. ఉత్సవాలకు పలువురు ప్రముఖులతో పాటు భక్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఆనందప్ప, ప్రధాన కార్యదర్శి పట్నంశెట్టి విశ్వనాథ్, కోశాధికారి పవన్, సలహాదారులు కుమార్, తరణి మఠం చండీశ్వర్, యాదప్ప, సిద్ధప్ప, గిరిధర్, భద్రప్ప, బాలరాజ్, శ్రీకాంత్, రవి, భాను తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్‌లోని 28వ డివిజన్‌లోని శ్రీమారుతీనగర్ కాలనీవాసులు ఆదివారం క్యాంప్ ఆఫీస్‌లో మాజీ కార్పొరేటర్ సూర్లగంటి అర్జున్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అనంతరం కాలనీ అధ్యక్షుడు మెరుగు వేణు మాట్లాడుతూ.. శ్రీమారుతీనగర్‌లో సమస్యలు తిష్ట వేశాయని డ్రైనేజీ, సీసీరోడ్లు, వీధిదీపాలు, కృష్ణావాటర్ లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలని విన్నవించారు. అధికారులతో చర్చించి త్వరలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని వారికి ఎమ్మెల్యే హామీనిచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి త్రివేణి, కోశాధికారి ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు సాయికుమార్, రాజిరెడ్డి, సభ్యులు కృష్ణమోహన్, వెంకట్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, రమేశ్, ప్రదీప్‌కుమార్, చంద్రశేఖర్, లష్కర్‌నాయక్, అశోక్, రాజేందర్, కిరణ్, సాయిలాల్, విజయ్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

చెక్కు అందజేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: కోనేరులో పడి మృతి చెందిన భక్తుడి కుటుంబానికి రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం గుండాల అంబ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ ఏడాది శివరాత్రి రోజున ఆలయంలోని కోనేరులో భక్తుడు పెరుమాళ్ల ఓమేష్ నీట మునిగి చనిపోయాడు. ఈ మేరకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును ఆదివారం నగరంలోని తన నివాసంలో ఎమ్మెల్యే.. మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సందీప్ రెడ్డి, కిసాన్‌సెల్ తాలూకా అధ్యక్షుడు పర్వత్ రెడ్డి, రాజేష్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు అరుణ్, అంజయ్య, అర్చకులు కష్టయ్య, నరహరి శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఇబ్రహీంపట్నంలో.. కేక్ కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

ఇబ్రహీంపట్నం/ కడ్తాల్: కడ్తాల్ మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని యువకులు, వివిధ పార్టీల నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నగరంలోని తన నివాసంలో కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. శుభాకాంక్షలు తెలిపారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పర్వత్‌రెడ్డి, కేశవులు, రాజేశ్‌రెడ్డి, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌గౌడ్, రమేశ్‌గౌడ్, యాదయ్య, వినోద్, కిశోర్‌రెడ్డి ఉన్నారు.

కడ్తాల్ మండల కేంద్రంలో..

డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కోఆప్షన్ మాజీ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు షాబుద్దీన్, సత్యం, రాజేశ్, రాజేందర్, బుచ్చయ్య, జగన్, యాదయ్య, అజ్గర్‌అలీ, ప్రవీణ్ ఉన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1983–84 విద్యాసంవత్సరం పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నాగభూషణ్ నివాసంలో కేక్ కట్ చేసి ఆటపాటలతో సందడి చేశారు. సాంప్రదాయ బద్ధంగా ఫ్రెండ్షిప్ బ్యాండ్లకు బదులు మహిళలు ఒకరి చేతికి ఒకరు గాజులు తొడుక్కున్నారు. పండ్లు, తమలపాకులు, కుంకుమ, పసుపును వాయనంగా ఇచ్చిపుచ్చుకున్నారు. కార్యక్రమంలో సరళ, వసుందర, అనిత, వీరమణి, సునీత, లింగమ్మ, అన్నపూర్ణ, లలిత, గ్లోరి, జానకి, భూషణ్, చండీశ్వర్, సంజీవ, దుదియానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కెమెరాలు దోహదం



ఎమ్మెల్యే సబితారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న కాలనీసులు

బడంగ్‌పేట్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్‌లోని సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కెమెరాలను ఎమ్మెల్యే సబితారెడ్డి విచ్చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతీ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, పి.ఆనంద్‌రెడ్డి, సుర్లగంటి అర్జున్, లిక్కి కృష్ణారెడ్డి, ఏనుగు రాంరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పుట్టగళ్ల సంతోష్, కాలనీ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, వెంకటేశ్, యశ్వంత్, శంకర్, సురేష్, నర్సింహా, భాస్కర్, అశోక్ చక్రవర్తి, మహిళలు ఉన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సహాయం అందజేత



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మహేశ్వరం: కందుకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1997–98 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన విద్యార్థి సీహెచ్ లింగం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. వైద్య ఖర్చులకు తోటి విద్యార్థులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచారు. లింగం మండల కేంద్రంలో బీరువాలు తయారు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. పనులు ముగించుకొని ఇంటికి బైక్‌పై వస్తుండగా రాచులూరు గేటు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో లింగంకు కాలు, చేయి, పక్కటెముకలు విరిగిపోయాయి. ఆస్పత్రిలో వైద్యం కోసం భారీగా ఖర్చు అవుతుండడంతో తోటి విద్యార్థులు విషయం తెలుసుకొని రూ.45 వేలు ఆర్థికసాయం అందజేసి.. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బర్కం వెంకటేశ్, సౌడపు శేఖర్‌గౌడ్, ఎడ్ల వెంకటేశ్‌ముదిరాజ్, జంగాచారి, సుబాష్, మల్లేష్, రాంచంద్రి పలువురు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడులో..

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం శ్రీకంఠ మహేశ్వరస్వామి, ఆదివారం పోచమ్మ, ఎల్లమ్మ తల్లి బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గౌడ కులస్థులు.. గ్రామస్తులతో కలిసి మహేశ్వరస్వామి, ఎల్లమ్మ, పోచమ్మ ఆలయాలకు డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి దేవతా మూర్తులకు నైవేద్యంగా బోనాలు సమర్పించారు.

ఆదిబట్లలో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్, మంగళ్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడు గ్రామాల్లో బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి, నైవేద్యంగా దేవతలకు బోనం సర్పించారు. పోతురాజుల ఆటలు ఆకట్టుకున్నాయి.



అబ్దుల్లాపూర్‌మెట్: కవాడిపల్లిలో బోనాలతో మహిళలు